# జైహింద్

## -పుట్టగంటి గోపీకృష్ణ



### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో బహుమతి పొందిన ఉత్తమ నవల

### (గత సంచిక తరువాయి)

**కాంచనమాల, ఫ్లోరెన్స్,** మధుబాల, చేవా వెళ్ళిపోయాక చాలాసేపటి వరకు అచింత్ డోల్మాతో ఏమీ మాట్లాడలేదు.

ఎట్టకేలకు నిశ్శబ్దాని ఛేదిస్తూ, "ఆడవాళ్లలో ఇంత ధైర్యవంతులని నేను ఇంతవరకు చూడలేదు..." అన్నాడు అచింత్.

"మగవాళ్లలో కూడా చూడలేవు." అంది డోల్మా.

మౌనంగా ఉండిపోయాడు అచింత్. మరి కాసేపటి తరువాత, "వీళ్ళు నలుగురు శనివారం నాటికి కలకత్తా వెళ్తున్న విషయం హెడ్‌క్వార్టర్‌కి చేరవేయాలి..." అన్నాడతను.

"నేను కూడా వస్తాను..." అంది డోల్మా. "ముందుగా నాకు ఆ రేడియో ఎలా ఆపరేట్ చేయాలో నేర్పించు." అంది.

"నేనున్నానుగా..." అంటూ ఏదో అనబోయాడు అచింత్.

"మిగిలిన వాళ్లతో వెళ్లకుండా నేను ఒంటరిగా ఇక్కడ ఉంది ఎందుకనుకున్నావ్? ఫుట్‌బాల్ మైదానంలో జరిగిన హత్యల తరువాత పోలీసులు ఊరంతా వెతుకులాట మొదలు పెట్టారని నీకూ తెలుసు. వారు సరిగ్గా పరిశోధన చేస్తే నీ పేరు తెలుసుకోవటానికి ఎక్కువ రోజులు పట్టదు. వారు నిన్ను పట్టుకున్నా, చంపినా మన పని ఆగకూడదనే నేను ఇక్కడ ఉన్నాను. నేను పని నేర్చుకోకపోతే ఎలా?" అంది ఆమె.

తమ చావు గురించి అంత మామూలుగా మాట్లాడుతున్న డోల్మాను ఎలా అర్థం చేసుకోవాలో అచింత్‌కు అర్థం కాలేదు. చాటుగా దాచిన రేడియో ట్రాన్స్‌మిటర్‌ని బయటకు తీస్తూ, “అయితే, నేను పట్టుబడతానని నువు డిసైడ్ అయిపోయావన్న మాట...” అన్నాడు.

ఆమె మాట్లాడ లేదు. తన దృష్టిని ఆ రేడియో పరికరం మీద పెట్టింది. “ఇది ఇంత పెద్దగా ఉంటుందనుకోలేదు...” అంది.

భుజం మీద తగిలించుకునేందుకు వీలుగా ఉంది ఆ పరికరం. ట్రాన్స్‌మిటర్, రిసీవర్ విడివిడిగా ఉన్నాయి. ట్రాన్స్‌మిటర్‌తో పాటు మోర్స్ కోడ్ పంపే పరికరం ఉంది. రిసీవర్‌కి హెడ్‌ఫోన్ పెట్టుకునే వీలు కూడా ఉంది. దానిని ఛార్జ్ చేయటనికి వీలుగా ఒక వైరు, అడాప్టర్ ఉన్నాయి. ఒక పక్కన ఉన్న చిన్న పుస్తకం చూపించి, “ఇది ఒన్ టైమ్ కోడర్...” అని చెప్పాడు అచింత్. మనం పంపాల్సిన మెసేజ్‌ను ఈ కోడ్ ఉపయోగించి కోడెడ్ లాంగ్వేజిలోకి మార్చాలి. దానిని మోర్స్ కోడ్ ద్వారా ట్రాన్స్‌మిట్ చెయ్యాలి...”

తరువాత వాళ్ళు పంపాల్సిన మెసేజ్‌ను కోడ్ లాంగ్వేజిలోకి ఎలా మార్చాలో నేర్పాడు. “మనం ఎంత త్వరగా వీలయితే అంత త్వరగా మెసేజ్ ట్రాన్స్‌మిట్ చెయ్యాలి. ఎందుకంటే మన ట్రాన్స్‌మిషన్ మొదలయిన క్షణాల్లోనే ఆ విషయం కౌంటర్ ఇంటెలిజెన్స్ వాళ్లకు తెలుస్తుంది. కానీ, వాళ్లకు సరిగ్గా మనం ఏ ప్రదేశం నుండి ట్రాన్స్‌మిట్ చేస్తున్నామో తెలియాలంటే కొద్దిగా సమయం పడుతుంది. అందుకే మనం ఏదో ఒక నిర్మానుష్యంగా ఉండే ప్రదేశానికి వెళ్ళి ట్రాన్స్‌మిట్ చెయ్యాలి. వీలయినంత త్వరగా పని ముగించుకుని వెనక్కి వచ్చెయ్యాలి...” అని వివరించాడు.

ఆ తరువాత ఇద్దరు అనుకున్న మెసేజ్ హెడ్‌క్వార్టర్‌కి పంపించటానికి, ఆ రేడియో ట్రాన్స్‌మిటర్ తీసుకుని బయటకు నడిచారు.

“మీరందరు చేతకాని వెధవలు...” అని పెద్దగా అరిచాడు కోహిమా కమాండ్ సెంటర్ అధికారి.

అందరు తలలు వంచుకున్నారు.

“అసలు ఇక్కడ ఏం జరుగుతోంది? ఏవరో బయట నుండి వచ్చి బహిరంగంగా మన వాళ్లను చంపుతారు. మన రహస్యాలను రేడియో సందేశాల రూపంలో శత్రువులకు చేరవేస్తారు. మనం మాత్రం చేతులు ముడుచుకుని ముప్పొద్దులా తింటూ, రాత్రికి నిద్ర పోతూ ఎంజాయ్ చేస్తుంటాం...”

అంత పెద్ద అధికారి ఆ విధంగా తిడుతుంటే అందరి రక్తం మరిగి పోయింది.

“మీలో చీమూ, నెత్తురూ ఉంటే... మరోసారి ఎలాంటి వంక పెట్టకుండా మనకు ద్రోహం చేస్తున్న వాళ్లను పట్టుకు రండి. లేదంటే మీ మొహం కూడా నాకు చూపించకండి...” అంటూ సమావేశం ముగించాడు ఆ అధికారి.

అతని మాటలు విన్న అందరిలో ఎలా అయినా ఆజాద్ హింద్ ఫౌజ్ గూఢచారులను పట్టుకోవాలన్న కసి పెరిగి పోయింది.

లారీలో నుండి దిగిన కాంచనమాల, చేవా లారీ వెళ్ళిపోయేవరకు ఆగి, నెమ్మదిగా వెలుతురు కనిపిస్తున్న వైపు నడిచారు.

చెట్ల చాటు నుండి కనిపిస్తున్న వెలుతురు దగ్గరకు వెళ్లే కొద్దీ స్పష్టమయింది.

అదొక మిలటరీ క్యాంపు. అంత పెద్ద క్యాంపును వారిద్దరు జీవితంలో ఎప్పుడూ చూసి ఉండరు. చుట్టూ ముళ్లు ఉండే ఇనుప తీగల కంచె వేసి ఉంది. లోపల వేలాదిగా మిలటరీ వారు ఉన్నారు.

మరింత ముందుకు వెళ్ళే లోపు తమ దగ్గర ఉన్న ఆయుధాలు, పావురాలను ఒక చెట్టు తొర్రలో దాచారు వారు. ఆయుధాలు ఉన్నా అన్ని వేల మంది ముందు అవి ఎందుకు పనిచేయవు. అలాంటపుడు ఎదుటి వారికి పట్టుబడినా నిరాయుధులుగా ఉంటే ఏదో ఒకటి బుకాయించి బయటపడవచ్చు.

చెట్ల గుబుర్లను చాటు చేసుకుని మరింత ముందుకు నడిచారు. ముందుకు వెళ్లేకొద్దీ లోపల ఉన్న వాహనాలు, ఆయుధాలు కూడా కనిపిస్తున్నాయి. మెటడర్ ట్రక్కులు, ఆస్టిన్ అంబులెన్సులు, బి.ఎస్.ఎ, రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటర్‌సైకిళ్ళు, విల్లీస్ జీపులు, పారాచూట్ ద్వారా చేరవేసే వెల్ బైకులు... అదంతా ఒక పెద్ద యుద్ధానికి సన్నాహంగా ఉంది.

ఇకపోతే యుద్ధ సన్నాహాలకు అవసరమయిన మటిల్డా, వాలెంటైన్ ట్యాంకులు, సెల్ఫ్ ప్రొపెల్లెడ్ గన్స్, టూ ఇంచ్ మరియు త్రీ ఇంచ్ మోర్టర్లు, ఏంటీ ఎయిర్‌క్రాఫ్ట్ ఆర్టిల్లరీ, హోవిట్జర్ గన్స్, ఏంటీ ట్యాంక్ వెపన్స్ లెక్కలేనన్ని ఉన్నాయి.

ఫ్లడ్ లైటు వెలుతురులో ఆవరణంతా తడిసిపోతోంది.

అక్కడ ఉన్న టెంట్ల సంఖ్యను బట్టి ఉజ్జాయింపుగా లెక్క వేసినా దాదాపు 15000 మంది సైనికులు అక్కడ ఉండి ఉంటారని కాంచనమాలకు అనిపించింది. అదే చేవాతో అంది.

“అవును. కోహిమా నుండి వెనక్కి పంపామని చెప్తున్న సైనికులను ఇక్కడ దాచి ఉంచారు.” అంది చేవా.

“ఎందుకంటావ్?”

“ఎందుకేమిటి? ఆజాద్ హింద్ ఫౌజు సైన్యాన్ని తప్పు దారి పట్టించటానికి. సైన్యం అంతా వెనక్కి వెళ్ళి పోయిందని మన వాళ్లు వచ్చి కోహిమాలో ఇరుక్కుపోతే, వీళ్ళు ఒక్కసారిగా దాడి చేస్తారు. అదే వీళ్ల పథకం అయి ఉంటుంది...”

“అవును. నీ ఊహ నూటికి నూరు పాళ్ళు నిజంలానే ఉంది...” అంది కాంచనమాల.

“మరి ఏం చేద్దాం?”

“వెంటనే మనం వెనక్కు వెళ్దాం. ఈ విషయం హెడ్‌క్వార్టర్‌కి తెలియచేద్దాం...”

ఇద్దరూ నెమ్మదిగా వెనక్కి తిరిగారు. అక్కడ నిలబడి ఉన్న ఇద్దరు సైనికులను చూసి షాక్ కొట్టినట్లు నిలబడి పోయారు.

షిల్లాంగ్ చేరిన మధుబాల, ఫ్లోరెన్స్ ఒక హోటల్ గది అద్దెకు తీసుకుని స్నానం చేసి భోజనం చేశారు. మధుబాల పక్కన ఫ్లోరెన్స్ ఉండటంతో వారిని ఎవరూ అనుమానించే అవకాశం లేకుండా పోయింది.

నాలుగు గంటలు నిద్ర పోయి లేచి తిరిగి సామాను సర్దుకున్నారు.

అయితే షిల్లాంగ్ నుండి కలకత్తా వెళ్ళటానికి లారీ ఎక్కనవసరం లేదని అక్కడ వాళ్లు చెప్పారు. 135 కిలోమీటర్ల దూరంలో గౌహతి ఉందని, అక్కడ నుండి కలకత్తాకు రైళ్లు ఉన్నాయని తెలియటంతో ఒక కారు అద్దెకు తీసుకుని గౌహతి బయలుదేరారు వారు.

వారు గౌహతి రైల్వే స్టేషన్ చేరుకునేటప్పటికి సాయంత్రం అయింది. మరో రెండు గంటల్లో కలకత్తా వెళ్ళటానికి రైలు ఉందని తెలుసుకుని దానికి రెండు టికెట్లు కొనుక్కున్నారు.

ఫ్లోరెన్స్‌తో కలిసి ఫస్ట్ క్లాస్ వెయిటింగ్ రూములో కూర్చుని రాబోయే రైలు కోసం ఎదురు చూడటం మొదలు పెట్టింది మధుబాల.

తెల్లవారితే శనివారం. అప్పటికల్లా తాము కలకత్తాలో ఉంటామనుకుంటేనే వారికి ఎగ్జయిట్‌మెంట్‌గా ఉంది.

టెలిఫోన్ మోగటంతో కలనల్ వార్నర్ అర్ధరాత్రి నిద్ర నుండి లేచి కూర్చున్నాడు. ఎంతో అవసరం అయితే తప్ప ఈ సమయంలో తనకు ఫోన్ చేయరని అతనికి బాగా తెలుసు.

"హలో..." అన్నాడు వార్నర్ తన స్వరంలో నిద్ర మత్తు ధ్వనించకుండా ఉండటానికి ప్రయత్నిస్తూ.

కౌంటర్ ఇంటెలిజెన్స్ డిపార్ట్‌మెంట్ నుండి వచ్చిన ఫోన్ అది. "ఇంకొక మెసేజ్ ఇప్పుడే సంతోష్ పంపాడు. దాన్ని డీకోడ్ చేయటం కూడా పూర్తయింది. కొద్దిగా ముఖ్యమయిన విషయంలా ఉంది. మీరు వస్తే బాగుంటుందేమో..." అంటున్నారు అవతల వాళ్ళు.

డ్రస్ ఛేంజ్ చేసుకుని బయటకు వచ్చాడు వార్నర్. ఆ సమయంలో బయటకు వచ్చిన వార్నర్‌ని చూసి గార్డు స్టిఫ్‌గా సెల్యూట్ చేసి, "డ్రైవర్‌కి కబురు చేయమంటారా?" అన్నాడు.

కౌంటర్ ఇంటెలిజెన్స్ ఆఫీసు కేవలం రెండు వందల మీటర్ల దూరంలో ఉంటుంది. అందుకే వద్దన్నట్లు అతనికి సైగ చేసి కాలి నడకన అటు బయలుదేరాడు.

సూర్యుడు అస్తమించని బ్రిటిషు సామ్రాజ్యం అని బింకాలు పోయిన రోజులు వేగంగా మారిపోతున్నాయి. పరిస్థితులు ఇలానే కొనసాగి రెండవ ప్రపంచ యుద్ధంలో ఓడిపోతే, ప్రపంచాన్ని ఏలటం సంగతి ఏమో కానీ, తమకే నిలువ నీడ లేక దేశ దిమ్మర్లలా రోడ్లు పట్టుకు పోవాలేమో. అందుకే ఇప్పుడు జరుగుతున్న ఈ యుద్ధం తమ భావిని

నిర్ధారించబోతోంది. అందులోనూ... ఇండియా-బర్మా సరిహద్దుల్లో జరగబోతున్న సంగ్రామం ఎట్టి పరిస్థితుల్లోనూ గెలిచి తీరవలసిందే. అందుకు ఏమి చేయటానికయినా అతను తయారుగా ఉన్నాడు.

ఆలోచనల మధ్య అతను కౌంటర్ ఇంటెలిజెన్స్ ఆఫీసుకు చేరుకున్నాడు.

అతనికి సంతోష్ పంపిన మెసేజ్ చూపించారు.

“శనివారం వస్తున్న ఇద్దరు ఏజెంట్లను రిసీవ్ చేసుకోవటానికి సిద్ధంగా ఉన్నాను. ఎప్పుడూ కలుసుకునే ప్రదేశానికి వారిని పంపండి...” అని ఉంది ఆ మెసేజ్‌లో.

“కానీ ఈ మెసేజ్‌లో వాళ్లు ఎక్కడ కలుసుకుంటారో లేదు...” అన్నాడు ఒక అధికారి.

“అదొక విషయమే కాదు. సంతోష్ ఎక్కడ ఉంటాడో మనకు తెలుసు. వాడి మీద ఇప్పటి నుండి ఇరవై నాలుగ్గంటల నిఘా పెట్టండి. వాడిని అనుసరించి వెళ్తే, ఆ వచ్చే ఏజెంట్లని పట్టుకోవటం పెద్ద పని కాదు.”

“మరి ఈ బాధ్యత ఎవరికి అప్పగిద్దాం?”

“ఇది ఒకరికి అప్పగించే బాధ్యత కాదు. నేనే వెళ్తాను...” చెప్పాడు వార్నర్.

“ఎవరు మీరు? నిజం చెప్పండి...” అని కాంచనమాలను మరోసారి అడిగాడు ఇంటరాగేట్ చేస్తున్న అధికారి.

ఆమె ఒక కన్ను కమిలిపోయి సగం మూసుకు పోయింది. పెదిమ చివరి నుండి రక్తం చార కారి ఉంది. ఇరవై నాలుగు గంటలుగా కాంచనమాలని, చేవాని విడివిడి గదుల్లో పెట్టి ఇంటరాగేట్ చేస్తున్నారు. అడిగిన ప్రశ్ననే అడుగుతూ వారి నుండి సమాధానాలు రాబట్టాలని ప్రయత్నిస్తున్నారు.

“మీరు ఎన్నిసార్లు అడిగినా నేను చెప్పేది ఒకటే. నేను అమాయకురాలిని. ఏ తప్పూ చేయలేదు...” బింకంగా ఉండటానికి ప్రయత్నిస్తూ చెప్పింది కాంచనమాల.

“అర్ధరాత్రి సమయంలో మా క్యాంపు దగ్గరకు ఎందుకు వచ్చావ్?”

“సార్! ఇక్కడ ఉంది మీ క్యాంప్ అని ఎవరికి తెలుసు సార్? కొత్తగా కనిపిస్తే అదేంటో చూడటానికి వచ్చాం.”

“ఆ మాట నిజమే అని అనుకుందాం. చుట్టు పక్కల ఏ ఊరూ లేని ఈ ప్రదేశంలోకి ఆ సమయంలో ఎందుకు వచ్చావు?”

“నేను, నా స్నేహితురాలు షిల్లాంగ్ వెళ్తున్నాం. వెలుతురు కనిపిస్తున్న ప్రాంతం మిలటరీ స్థావరం అని నేనంటే, కాదని తను అంది. అదేంటో చూద్దామని అడవిలో నుండి నడుచుకుంటూ వచ్చాం.”

“షిల్లాంగ్ ఎలా వెళ్తున్నారు?”

“లారీ ఎక్కాం. దాని టైరు పంచర్ అయి ఇక్కడ ఆగింది. అప్పుడు మేము వెలుతురు చూశాం.”

“రోడ్డు మీద ఏ లారీ లేదు. నువు చెప్తోంది అబద్ధం...”

"లారీ ఇంకా అక్కడ ఎందుకు ఉంటుంది? పంచర్ వేయటం పూర్తి అయ్యాక కాసేపు చూసి మేం రాక పోవటంతో వెళ్ళి పోయి ఉంటుంది..."

ఆమె దగ్గర ప్రతి ప్రశ్నకీ సమాధానం ఉండటంతో ఇంటరాగేట్ చేస్తున్న వ్యక్తికి ఏమి చేయాలో అర్థం కాలేదు. విసుగ్గా మరోసారి చెంప ఛెళ్లుమనిపించి బయటకు వచ్చాడు.

అదే సమయంలో చేవాని ఇంటరాగేట్ చేస్తున్న వ్యక్తి కూడా బయటకు వచ్చాడు.

ఇద్దరు ఖైదీలు తమకు చెప్పిన సమాధానాలు పోల్చి చూసుకున్నారు. అన్నీ ఒకే రకంగా ఉన్నాయి.

"బహుశా వాళ్ళు చెప్తోంది నిజమే కావచ్చు. అమాయకంగా వచ్చి ఇరుక్కుపోయినట్లు ఉన్నారు..." అన్నాడు మొదటి వ్యక్తి.

కాంచనమాల, చేవా పట్టుబడితే చెప్పవలసిన కథని ముందే ఆలోచించి పెట్టుకున్నారని వీరికి తెలియదు.

"నాకూ అదే అనిపిస్తోంది..." అంగీకరించాడు రెండవ వ్యక్తి.

"అలా అని వీళ్లను వదిలి పెట్టలేం. మన పని పూర్తి అయ్యేవరకు వీరిని బందీలుగానే ఉంచుదాం. తెలిసో, తెలియకో వీళ్ళు బయటకు వెళ్ళి ఇక్కడ విషయాల గురించి మాట్లాడారంటే మన వ్యూహం దెబ్బ తినే అవకాశం ఉంది."

రెండవ వ్యక్తి అందుకు అంగీకరించాడు.

కాంచనమాల, చేవాలను ఆ ఆవరణలోనే ఉన్న ఒక గదిలో బంధించి ఉంచమని ఆదేశాలు ఇచ్చి వాళ్ళు అవతలకు వెళ్లిపోయారు.

కోహిమాలో ఉన్న సైనికులు, పోలీసులు మిగిలిన పనులన్నీ పక్కన పెట్టి మరీ ఫుట్‌బాల్ మ్యాచ్‌లో జరిగిన హత్య ఎవరు చేశారనే విచారణ వేగవంతం చేశారు. ఒక మామూలు హత్యను సాల్వ్ చేయలేకపోయారని పై అధికారులు అవమానిస్తుంటే ఆ విషయాన్ని ఒక ఛాలెంజ్‌గా తీసుకున్నారు.

ఫుట్‌బాల్ మ్యాచ్‌ను చూడటానికి వెళ్లిన ప్రతి ఒక్కరినీ వారి ఇళ్లకు వెళ్ళి ప్రత్యేకంగా విచారిస్తున్నారు పోలీసులు. ఆ రోజు జంట హత్యలు జరిగిన చెట్టు దగ్గర ఎవరయినా అనుమానాస్పదంగా కనిపించారా అని అడుగుతున్నారు.

ఆ రోజు మ్యాచ్ చూడటానికి హాజరయిన వేల మంది ప్రేక్షకులను గుర్తించి ప్రశ్నించటం అన్నది ఎంతో పెద్ద పని. అయినా విసుగు లేకుండా చేస్తున్నారు వారు. వారి ఓపికకు ఎట్టకేలకు ఒక ఫలితం లభించింది.

మరీ మరీ అడగ్గా గుర్తు చేసుకుని ఒక మధ్యవయస్కుడు స్పందించాడు. "ఒకమ్మాయి ఆ చెట్టు ఎక్కటం కనిపించింది. అప్పుడు నేను ఆ విషయాన్ని సరిగ్గా పట్టించుకోలేదు. ఆట బాగా కనపడటానికి చెట్టు ఎక్కుతుందేమో అనుకున్నాను. ఇప్పుడు మీరు అడుగుతుంటే నాకు కూడా అనుమానం వస్తోంది. ఆ అమ్మాయి చెట్టు ఎక్కుతున్న విధానం చూస్తే ఏదో ఆట చూడటానికి ఎక్కినట్టు లేదు. అడవిలో ఉడుము చెట్టు ఎక్కినట్లు చకచకా ఎక్కింది." అని చెప్పాడు.

ఇంకొందరు పోలీసులు ఆ రోజు ఫుట్‌బాల్ మ్యాచ్ ఫొటోలు తీయటానికి వెళ్ళిన ఫొటోగ్రాఫర్లను అడిగి ఆ రోజు తీసిన మొత్తం ఫొటోలు తెచ్చుకున్నారు. వాటిలో హత్య జరిగిన చెట్టు కనపడేలా ఉన్న ఫొటోలను సేకరించి పరిశీలించటం మొదలు పెట్టారు.

ఒక ఫొటోలో ఆ చెట్టు ముందు నిలబడి ఉన్న ఒక వ్యక్తి కనిపించాడు. మరొక ఫొటోలో అతనితో మాట్లాడుతున్న ఇద్దరు ఆడవాళ్లు కనిపించారు.

“చెట్టు ఎక్కిన అమ్మాయి కూడా ఇలాంటి డ్రెస్సే వేసుకుంది...” చెప్పాడు ఆ ఫొటోలు చూసిన మధ్యవయస్కుడు.

“చెట్టు దగ్గర నిలబడిన వ్యక్తి ఎవరో కనుక్కోండి. మిగిలిన విషయాలన్నీ అవే బయటపడతాయి...” అన్నాడు పోలీసు అధికారి.

ఆ వ్యక్తి ఎవరో కనుక్కోవటానికి ఎంతో సమయం పట్టలేదు. ఆ రాత్రి పది గంటల ప్రాంతంలో వారికి ఆధారం లభించింది.

“ఇతనా! ఇతను నాకెందుకు తెలియదు. బేకరీలో పనిచేస్తాడు...” అని చెప్పాడు అచింత్ దగ్గర బేకరీ సరుకులు కొనే ఒక వ్యక్తి.

విజయోత్సాహంతో పోలీసులు ఆ బేకరీ దగ్గరకు బయలుదేరారు– మిగిలిన పని ముగించటానికి.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS